మెరుగైన వైద్య సేవలు అందించాలి
కలెక్టర్ జితేశ్ వి పాటిల్

మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

మణుగూరు టౌన్, మార్చి 4 : ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే నిరుపేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రిని కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో కలియతిరుగుతూ జనరల్ వార్డు, ఇన్ పేషెంట్ వార్డు, ల్యాబ్, స్కానింగ్, డయాలసిస్ యూనిట్లను పరిశీలించారు. అనంతరం రోగులతో మాట్లాడుతూ వైద్య సేవలు అందుతున్నాయా? మందులు సరిగా ఇస్తున్నారా? వైద్యులు అందుబాటులో ఉన్నారా? ఎన్ని రోజుల నుంచి ఆస్పత్రిలో ఉంటున్నారు? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వైద్య సేవల సుదూర ప్రాంతాల నుంచి పేదలు ఎక్కువగా వస్తారని, వారికి పరీక్షలు చేసి మందులు అందించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని సదుపాయాలు ఉన్నాయని, వాటిని ప్రజలు వినియోగించుకునేలా చూడాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోకుండా అవగాహన కల్పించాలన్నారు. ఆస్పత్రిలో కొత్తగా బాధ్యతలు స్వీకరించిన గైనకాలజిస్టు డాక్టర్ అజంతతో మాట్లాడారు. వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీల్, ఆర్ఎంవో గౌరీప్రసాద్, డ్యూటీ డాక్టర్లు పాల్గొన్నారు.

బీటీపీఎస్ రైల్వే ట్రాక్ నిర్వాసితులతో కలెక్టర్ చర్చలు

బీటీపీఎస్ రైల్వే ట్రాక్ భూ నిర్వాసితులతో కలెక్టర్ జితేష్ వి పాటిల్ మణుగూరు తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం చర్చలు జరిపారు. ప్రభుత్వ భూమి విలువ ప్రకారం రేటు ఇవ్వాలని, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ లేదా నిర్వాసితులకు ఉద్యోగం ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. ఇప్పలసింగారం పంచాయతీలోని బీటీపీఎస్ రైల్వే ట్రాక్ భూ నిర్వాసితులు కుటుంబీకుల్లో 18 సంవత్సరాలు నిండిన వారికి ఉద్యోగం లేదా కంపెనీ లాభాల్లో నిర్వాసితులకు వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నుంచి మీకు అన్ని విధాలా సహాయం చేస్తామని, స్వయం ఉపాధి పథకాలు, మిగిలిన భూముల్లో డ్రిప్ సౌకర్యం, పామాయిల్ సాగుకు కావాల్సిన అన్ని విధాలా సహకారాలు అందిస్తామని చెప్పారు.

మాజీ జడ్పీటీసీని పరామర్శించిన బీఆర్ఎస్ నేతలు

మణుగూరు టౌన్, మార్చి 4: మణుగూరు మండలంలోని అశోక్‌నగర్‌లో మాజీ జడ్పీటీసీ పోశం నర్సింహారావు బాబాయ్ పుల్లయ్య (94) అకస్మాత్తుగా మృతిచెందాడు. బీఆర్ఎస్ నాయకులు ఆయన నివాసానికి వెళ్లి పుల్లయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. నర్సింహారావును పరామర్శించి ఓదార్చారు. బీఆర్ఎస్ నాయకులు కుంటా లక్ష్మణ్, నూకారపు రమేష్, వట్టం రాంబాబు, ముద్దంగుల కృష్ణ, ఆవుల నరసమ్మ, ఏడవల్లి వెంకటయ్య, ఉప్పతల రామారావు, దాసరి వెంకన్న, యూత్ నాయకులు బోశెట్టి రవి ప్రసాద్, గుర్రం సృజన్, గుంటక ఏశావ్, అడ్వకేట్ సాంబ నివాళి అర్పించిన వారిలో ఉన్నారు.

నిరంతరాయంగా విద్యుత్ అందించడమే లక్ష్యం

లైన్‌మెన్ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న భద్రాచలం ట్రాన్స్‌కో డీఈ జీవన్‌కుమార్, అధికారులు

బూర్గంపహాడ్, మార్చి 4: ప్రజలకు నిరంతరాయంగా విద్యుత్ అందించడమే విద్యుత్ శాఖ ప్రధాన లక్ష్యమని భద్రాచలం ట్రాన్స్‌కో డీఈ జీవన్‌కుమార్ అన్నారు. మంగళవారం తాళ్లగొమ్మూరులోని సబ్‌స్టేషన్‌లో లైన్‌మెన్ దివాస్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో విద్యుత్ సరఫరా చేసేందుకు లైన్‌మెన్‌లు క్షేత్రస్థాయిలో పనిచేసే యుద్ధవీరులని కొనియాడారు. ప్రమాదం జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని, భద్రతే సంస్థకు ప్రధానమన్నారు. అనంతరం లైన్‌మెన్లను శాలువాతో సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో భద్రాచలం ఏడీఈ వేణు, తాళ్లగొమ్మూరు ఏఈ గుర్రం ఉపేందర్, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

డైలీవైజ్ కార్మికుల వేతనాలు తగ్గించొద్దు

భద్రాచలం, మార్చి 4: హాస్టల్ డైలీవైజ్ కార్మికుల వేతనాలను తగ్గిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో 64ను రద్దు చేసి కార్మికుల వేతనాలు యథావిధిగా కొనసాగించాలని, లేనిపక్షంలో ఈ నెల 12 నుంచి సమ్మె బాట పడతామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కలగాని బ్రహ్మాచారి హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఐటీడీఏ పీవో రాహుల్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవో 64ని వెంటనే రద్దు చేయాలని, ఇప్పటివరకు ఇస్తున్న వేతనాల సర్క్యులర్ ప్రకారం కార్మికులకు యథావిధిగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోకపోవడంతో 12 నుంచి సమ్మెకు వెళతామని స్పష్టం చేశారు.

భూములకు సాగునీరు అందించాలి

ములకలపల్లి, మార్చి 4 : సీతారామా ప్రాజెక్టు సాగునీరును జిల్లాలో ఎండుతున్న పంటలకు అందించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సాగర్ కాలువలో గోదావరి నీళ్లను కలిపేందుకు ప్రభుత్వం రైతాంగానికి మేలు చేస్తున్నప్పటికీ జిల్లాలో ముఖ్యంగా ములకలపల్లి మండలంలో పంటలకు చెరువులకు అందించాలని కోరారు. రాంబాబు, శ్రీరాములు, సారయ్య, లక్ష్మీనరసయ్య పాల్గొన్నారు.

ఏపీవోపై చర్యలు తీసుకోవాలి

ఇల్లెందు, మార్చి 4 : టేకులపల్లి మండలంలో ఏపీవో కాలంగి శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు ఉపాధి హామీ సిబ్బంది మంగళవారం వినతిపత్రం అందించారు. ఇల్లెందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన్ని కలిసి తమ సమస్యను వివరించారు.

కార్మికుల పనివేళలు మార్చాలి

ఇల్లెందు రూరల్, మార్చి 4 : ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కార్మికుల పనివేళల్లో మార్పులు చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొక్కు సారంగపాణి కోరారు. మంగళవారం సుభాష్‌నగర్‌లోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనివేళలను ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు చేయాలన్నారు. ఎండీ రాసుద్దీన్, సామేల్, ఉపేందర్, కిరణ్, వీరబాబు, రమేష్, చిట్టిబాబు, వీరస్వామి, నాగరాజు, బాబురావు, వెంకన్న పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

నెరవేరిన కేసీఆర్ కల

సాగర్‌లో కలవనున్న గోదావరి జలాలు
తొలిసారిగా సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలు
కేసీఆర్ ముందుచూపునకు జనం నీరాజనం

కాలువలో నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

ములకలపల్లి, మార్చి 4: గోదావరి కృష్ణమ్మతో కలిసి ఉమ్మడి జిల్లా వ్యవసాయ భూముల్లో పరవళ్లు తొక్కింది. చాలీచాలని నీళ్లతో ఎండిపోతున్న యాసంగి పంటలను పసిడి పచ్చగా తీర్చిదిద్ది సిరులు కురిపించే అద్భుత దృశ్యం సాక్షాత్కరించింది. తెలంగాణ సాధకుడు, నిత్య కృషీవలుడు, రైతుల పక్షపాతి, మాజీ సీఎం కల్వకుంట్ల కేసీఆర్ స్వప్నం సాకారమైంది. తెలంగాణలో సాగర్ కాలువ ద్వారా నీటి లభ్యత తగ్గిపోవడంతో సాగునీటి కొరత పెరిగింది. ముఖ్యంగా ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల రైతులకు సాగునీరు అవసరం తీవ్రంగా ఉంది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో గోదావరి నదీ జలాలను నాగార్జున సాగర్ కాలువకు అనుసంధానం చేస్తూ ఈ నెల 3వ తేదీన సీతారామా చివరి పంప్ హౌస్ ద్వారా గోదావరి జలాల లిఫ్టింగ్ ప్రక్రియను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లాంఛనంగా ప్రారంభించారు. ఇక్కడ నుంచి గోదావరి నీళ్లు రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా మంగళవారం సాగర్ ఆయకట్టుకు నీరు చేరనుండటంతో టీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కల నెరవనుంది. ప్రత్యేక రాష్ట్రంలో జలవనరుల వినియోగాన్ని సమర్థవంతంగా చేసేందుకు కేసీఆర్ పాలనలో రూపుదిద్దుకున్న ప్రాజెక్టులో ప్రధానమైంది సీతారామా ప్రాజెక్టు ఒకటి. 2016లో సుమారు ఎనిమిది వేల కోట్లు అంచనా వ్యయంతో మొదలైన ఈ ప్రాజెక్టు జిల్లాలోని అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు నుంచి ములకలపల్లి మండలం కమలాపురం వరకు సుమారు వంద కిలోమీటర్ల పొడవు కాల్వ పనులతోపాటు బీజీ కొత్తూరు, పూసుగూడెం, కమలాపురం గ్రామాల్లో మూడు పంప్ హౌజ్‌ల నిర్మాణాలు దాదాపు 90శాతం పనులు గత ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయి.

కేసీఆర్‌కు జనం నీరాజనం...

భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో సాగునీటి సౌకర్యానికి నోచుకోక పడావు పడిన లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించి సస్యశ్యామలం చేసేందుకు అప్పటి మాజీ మంత్రి ఈ ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ మూడు జిల్లాల్లోని బీడు భూములతో పాటు, అత్యంత పరిస్థితుల్లో గోదావరి జలాలు సాగర్ కాల్వలో కలిపేలా డిజైన్ చేయించారు. సాగర్ నీరు అడుగంటిపోయి తెలంగాణ ప్రాంతంలోని సాగర్ ఆయకట్టు ఎండిపోయే ప్రస్తుత పరిస్థితుల్లో కేసీఆర్ ముందుచూపు సాగర్ ఆయకట్టుకు జీవం పోసినట్లుందని జనం నీరాజనాలు పలుకుతున్నారు.

లక్ష్య సాధనకు ప్రణాళికలు రూపొందించుకోవాలి

పాల్వంచ రూరల్ : మాట్లాడుతున్న ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ

అశ్వారావుపేట రూరల్ : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

పాల్వంచ రూరల్, మార్చి 4 : విద్యార్థులు లక్ష్య సాధన కోసం విద్యార్థి దశ నుంచే ప్రణాళికలు రూపొందించుకోవాలని ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ అన్నారు. మంగళవారం గిరిజన విద్యార్థులకు ప్రేరణ కెరీర్ గైడెన్స్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉల్వనూరు ఏజీహెచ్ఎస్ బాలికల ఆశ్రమ పాఠశాలలో 8, 9, 10వ తరగతుల విద్యార్థినులకు వివిధ శాఖల అధికారులతో అవగాహన కల్పించారు. ఐటీడీఏ డీఈ, స్పెసల్ ఆఫీసర్ మధుకర్, తహసీల్దార్లు వివేక్, ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, ఎంఈవో శ్రీరాంమూర్తి, ఏవో శంభోశంకర్, మెడికల్ ఆఫీసర్ తేజశ్రీ, డీఈఈ సుధా, ఎస్సై సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుదలతో ఏదైనా సాధించవచ్చు

పాల్వంచ రూరల్, మార్చి 4 : పాల్వంచలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటానమస్ తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్, జన విజ్ఞాన వేదిక జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం సెమినార్ నిర్వహించారు. విశిష్ట అతిథి నీట్ వరంగల్ ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కృషి, పట్టుదల, నిబద్ధత, కఠోర శ్రమ, అకుంఠిత దీక్ష ఉంటే ఎంచుకున్న రంగంలో విజయం సాధించవచ్చన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

అశ్వారావుపేట రూరల్, మార్చి 4 : పదో తరగతి తర్వాత విద్యార్థులు ఏమి చదవాలి, ఎలా చదవాలి అనే దానిపై పలువురు అధికారులు టెన్త్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. మంగళవారం అశ్వారావుపేట మండలంలోని సున్నంబట్టి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో వివిధ ఆశ్రమ పాఠశాలల్లో 8, 9, 10వ తరగతులు చదువుతున్న 425 మంది గిరిజన విద్యార్థులకు కేరీర్ గైడ్‌లైన్స్ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, సీఐ కరుణాకర్, డీఈఈ(టీడబ్ల్యు) ఏవో శివరామప్రసాద్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ ప్రమీలా, రాందాస్‌నాయక్ వినాయకపురం పీహెచ్‌సీ వైద్యులు, ఆర్ఎస్ పద్మావతి, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

మా పాపను బతికించండి..
ఆర్థికసాయం కోసం ఓ తండ్రి వేడుకోలు

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పాప విఘ్నేశ్వరి

ఇల్లెందు రూరల్, మార్చి 4 : తమ పాపను బతికించేందుకు దాతలు ఆర్థికసాయం అందించాలని ఓ తండ్రి ప్రాధేయపడుతున్నాడు. వివరాల్లోకెళ్తే.. ఇల్లెందు మండలం 21 ఫిట్ ఏరియా విజయలక్ష్మీనగర్‌కు చెందిన బోళ్ల క్రాంతికుమార్ పాప విఘ్నేశ్వరికి మూడేళ్లు. గత కొన్ని రోజులుగా ఆరోగ్యం బాగాలేకపోవడంతో జనవరి 23న వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు పాపకు బ్లడ్ ఇన్‌ఫెక్షన్ ఉందని, ఇది శరీరం మొత్తం వ్యాపించడంతోపాటు కిడ్నీలు, గుండెకు ఇన్‌ఫెక్షన్ సోకిందని తెలిపారు. ఖరీదైన వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్న క్రాంతికుమార్ తన పాపను బతికించుకునేందుకు దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్నాడు. తన ఫోన్ నెంబర్ 9553174307ను సంప్రదించి ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని చేతులెత్తి విజ్ఞప్తి చేస్తున్నాడు.

పీఆర్‌టీయూ సంబరాలు

టేకులపల్లి, మార్చి 4 : నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ సంఘం అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి గెలిచిన సందర్భంగా మండల కమిటీ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. మంగళవారం టేకులపల్లి మండల కేంద్రంలో పీఆర్‌టీయూ మండల కమిటీ మిఠాయిలు పంపిణీ చేసింది. విజయనిర్మల, రవీందర్, మోతీలాల్, రమేశ్‌బాబు, బాలాజీ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను కొనసాగించాలి

ఇల్లెందు రూరల్, మార్చి 4 : రైల్వే సైడింగ్ కాంట్రాక్టు కార్మికులను యథావిధిగా కొనసాగించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొక్కు సారంగపాణి అన్నారు. మంగళవారం ఈ మేరకు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సింగరేణి హెడ్ ఆఫీస్‌లో జీఎం పర్సనల్ కవితానాయుడుకు అందజేశారు.

తునికాకు టెండర్లు నిర్వహించాలి

గుండాల, మార్చి 4: ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన రైతులకు రెండో పంట లాంటి తునికాకు సేకరణ టెండర్లు వెంటనే నిర్వహించాలని న్యూడెమోక్రసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల అటవీ క్షేత్రాధికారికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ప్రతిఏటా లక్షల ఆదాయం వస్తున్నా టెండర్లు నిర్వహించడంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కనబడుతుందని విమర్శించారు. సీతారాములు, కృష్ణ, పెంటయ్య, వెంకన్న, నరేష్, నాగేశ్వరరావు, అశోక్, ఉపేందర్ పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్య నిత్యకల్యాణం

స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, మార్చి 4: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం సీతారాములకు అర్చకులు నిత్య కల్యాణం నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాతసేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు జరిపారు. గాలిగోపురానికి అభిముఖంగా ఉన్న ఆంజనేయస్వామికి ఉదయం పంచామృతాభిషేకం చేసి తమలపాకులు, సింధూరంతో పూజలు చేశారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న జంటలకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

మాజీ ఎమ్మెల్యే మామను హత్య చేసిన మావోయిస్టులు
ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో ఘటన


ఘటనా స్థలంలో మావోయిస్టులు వదిలిన లేఖ

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మార్చి 4 : మాజీ ఎమ్మెల్యే మామను మావోయిస్టులు గొంతుకోసి దారుణంగా హతమార్చారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలో మంగళవారం వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. సుక్మా జిల్లా కొంట నియోజకవర్గంలో సీపీఐ పార్టీ నుంచి గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన మనిష్ కుంజాం మామ, పెంటపాడు గ్రామానికి చెందిన కమ్లూ హిడ్మా(65) ఆ గ్రామ పటేల్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి హిడ్మా ఇంటికి సాయుధులుగా వచ్చిన సుమారు ఆరుగురు మావోయిస్టులు అతడి గొంతుకోసి హత్య చేసినట్లు స్థానికుల ద్వారా పోలీసులకు తెలిసింది. ఘటనా స్థలంలోనే మావోయిస్టు పార్టీ కొంట ఏరియాకు చెందిన మావోయిస్టులు లేఖ విడిచి వెళారు. 'అక్కడి గ్రామస్తుల నుంచి భూమిని లీజుకి తీసుకుని, ఆ భూమిని బలవంతంగా తన పేరుపై పట్టా చేయించుకుంటున్నాడు' అని కమ్లూ హిడ్మాపై ఆరోపిస్తూ లేఖలో పేర్కొన్నారు. దీనిపై స్పందించిన మాజీ ఎమ్మెల్యే మనిష్ కుంజాం 'హింస.. హింసనే ప్రేరేపిస్తుంది' పేర్కొన్నారు. ఈ ఘటనతో ఆ ప్రాంత ప్రజలు తీవ్ర భాయాందోళనకు గురయ్యారు. హత్య ఘటనతో పోలీస్ అధికారులు సుక్మా జిల్లాలో హై అలర్ట్ ప్రకటించారు. ఈ ఘటనపై విచారణ జరుగుతుందని, మావోయిస్టుల కోసం సెర్చింగ్ ఆపరేషన్ ముమ్మరం చేసినట్లు ఎస్పీ కిరణ్ చవాన్ వెల్లడించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

అశ్వారావుపేట, మార్చి 4: వివిధ సంస్థల్లో పని చేస్తున్న అసంఘటిత కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలపై శుక్రవారం చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన వివరించారు. స్థానిక పెట్రోల్ బంకుల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను మంగళవారం ఆయన సేకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సూచించారు. దీనితో పాటు 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్‌లో పని చేస్తున్న కార్మికుల వేతనాలను ప్రతి ఐదేళ్ళకు ఒకసారి సవరించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశ్రామిక వేత్తలకు ప్రయోజనం కలిగించేలా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కేసుపాక నరసింహారావు, అశోక్, రాంబాబు పాల్గొన్నారు.

భార్యపై కత్తితో భర్త దాడి

పాల్వంచ, మార్చి 4 : భార్యమీద అనుమానంతో భార్యాభర్తల మధ్య చెలరేగిన వివాదంలో భర్త కత్తితో దాడిచేసిన ఘటన పాల్వంచలో మంగళవారం చోటుచేసుకుంది. పాల్వంచ పట్టణ పరిధిలోని బొల్లోరిగూడెంలో రేగా రవీందర్–లక్ష్మి దంపతులు వేరే ప్రాంతం నుంచి వచ్చి ఏడాదిగా నివాసముంటున్నారు. ఇటీవల వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం జరిగిన గొడవలో రవీందర్ లక్ష్మిపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. రక్తస్రావంతో కొట్టుమిట్టాడుతున్న లక్ష్మిని స్థానికులు 108లో పాల్వంచ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రవీందర్ పరారీలో ఉన్నాడు. పాల్వంచ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నల్లబ్యాడ్జీలతో కార్మికుల నిరసన

పాల్వంచ, మార్చి 4 : పాల్వంచలోని కేంద్రప్రభుత్వ కర్మాగారమైన స్పాంజ్ ఐరన్ ఎన్ఎండీసీ కార్మికులు, ఉద్యోగుల వేతన సవరణలు తక్షణమే ప్రకటించాలని, కర్మాగారాన్ని తిరిగి తెరిపించాలని కోరుతూ ఐదో రోజైన మంగళవారం కర్మాగారం వద్ద కార్మికులు నిరసన తెలిపారు. 2025 జనవరి 1న యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చి నెలరోజులు దాటిన యాజమాన్యం స్పందించకపోవడంతో ఎన్ఎండీసీ ప్రధాన గేట్ వద్ద వివిధ కార్మిక సంఘాలు, నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనను కొనసాగిస్తున్నారు. కోటేశ్వరరావు, బానోత్ బాలు, భద్రం, సుబ్రహ్మణ్యం, లాలేందర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

పాల్వంచ రూరల్, మార్చి 4 : మహిళను లైంగికంగా వేధిస్తున్న వ్యక్తిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన కథనం ప్రకారం... సూరారం గ్రామానికి చెందిన ఓ మహిళను అదే గ్రామానికి చెందిన భూక్యా అశోక్ గత కొంతకాలంగా లైంగికంగా వేధిస్తున్నాడు. మహిళ ఫిర్యాదు మేరకు ఎస్సై సురేష్ సురేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'వీకేవోసీ ప్రైవేటీకరణను అడ్డుకుంటాం'

రామవరం, మార్చి 4 : వీకేవోసీ ప్రైవేటీకరణను అడ్డుకుంటామని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. సింగరేణి కొత్తగూడెం ఏరియా వీకే వర్క్‌షాప్‌లో కొత్తగూడెం ఏరియా బ్రాంచి కార్యదర్శి కామ్రేడ్ వట్టికొండ మల్లికార్జున్‌రావు ఆధ్వర్యంలో వీకే వర్క్‌షాప్ పిట్ కార్యదర్శి కామ్రేడ్ మధుకృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వట్టికొండ మల్లికార్జున్, వీరస్వామి, గట్టయ్య, రాములు, సాంబమూర్తి, శ్రీనివాస్, అప్పారావు, గౌరీ వరప్రసాద్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

టేకులపల్లి, మార్చి 4 : గొడవలు వద్దు.. రాజీలు ముద్దు అనే నినాదంతో నిర్వహిస్తున్న మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని టేకులపల్లి ఎస్సై పోగుల సురేష్ అన్నారు. మంగళవారం టేకులపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు ఇల్లెందు కోర్టులో మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

యుగంధర్‌కు సన్మానం

ఇల్లెందు, మార్చి 4 : స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్‌గా ఎన్నికైన యాస యుగంధర్‌ను పలువురు నాయకులు ఇల్లెందులో మంగళవారం సన్మానించారు. ఇల్లెందు కోర్టు ఆవరణంలో యుగంధర్‌ను పూలమాలలు, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అడ్వకేట్ సువర్ణపాక సత్యనారాయణ, ఎట్టి హరికృష్ణ, ఆరెం కిరణ్, కృష్ణ, ప్రసాద్, మురళి, నవీన్ పాల్గొన్నారు.

చెక్కు కేసు కొట్టివేత

భద్రాచలం, మార్చి 4: 2017లో సారపాకకు చెందిన చల్లపల్లి నాగేశ్వరరావు, వరంగల్‌కు చెందిన కొత్త ఇందిరపై రూ.20 లక్షలు ఇవ్వాలని భద్రాచలం జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో చెక్‌బౌన్స్ కేసు వేశారు. ఆ కేసు నిరూపణ కాకపోవడంతో ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శివనాయక్ మంగళవారం కేసును కొట్టివేస్తూ తీర్పు ఇచ్చారు. కొత్త ఇందిర తరపున న్యాయవాది ముత్యాల కిశోర్, దాసరి కవిత వాదించారు.

జేకే 5 ఓసీని సందర్శించిన ఎమ్మెల్యే

ఇల్లెందు రూరల్, మార్చి 4 : జేకే 5 ఓసీని ఎమ్మెల్యే కోరం కనకయ్య మంగళవారం సందర్శించారు. ఇల్లెందు ఏరియా జీఎం కృష్ణయ్యతో కలిసి కలియతిరిగారు. అక్కడ ఉన్న ఓవర్‌మెన్స్, సర్వే అధికారులను గని పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, మహబూబ్, నాగేశ్వరరావు, ప్రభాకర్, శ్రీనివాస్, బాబురావు, సాంబమూర్తి, సూర్యం, డానియేల్ ఉన్నారు.

భవన నిర్మాణం నిలుపుదలకు నోటీసులు

చర్ల, మార్చి 4: మండలంలోని చర్ల అటవీశాఖ పరిధిలోని ఆర్ కొత్తగూడెం సెక్షన్‌లోని సున్నంవారిగూడెం గుంపులో తుర్రం కన్నయ్య, బుచ్చమ్మ, ముత్తయ్య పేర్లతో అటవీ హక్కులచట్టం ప్రకారం 2009లో భూమి హక్కు పత్రాలను అధికారులు అందజేశారు. మూడు నెలల క్రితం ఆ స్థలాల్లో చర్చి నిర్మాణం చేపట్టారు. చట్ట ప్రకారం భవన నిర్మాణాన్ని చేపట్టవద్దని హెచ్చరించామని, ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు మంగళవారం